



వైద్య కళాశాలను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

సమస్యల్లో 'మధ్యాహ్న భోజన' కార్మికులు

- తక్కువ వేతనాలతో వంట కార్మికుల అవస్థలు
- రూ.10 వేల వేతనం కోసం ఎదురుచూపులు
- నాలుగు నెలలుగా అందని బిల్లులు
- ఇబ్బందుల్లో వంట ఏజెన్సీల నిర్వాహకులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి కొద్ది వేతనంతో కుటుంబాలను పోషించలేక చాలా మంది మధ్యాహ్న భోజనం కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీల అవస్థలు తనకు తెలుసని వారికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.పది వేల వేతనం అందించి ఆదుకుంటామని జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చేసరికి ఇద్దరూ ఆ హామీని గాలికి వదిలేశారు. నాలుగు నెలలు అవుతున్నా మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు అందక వంట చేసిన నిర్వాహకులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో 2,131 ప్రభుత్వ పాఠశాలలు, 1,15,784 మంది విద్యార్థులు, 3,442 మంది మధ్యాహ్నం భోజనం కార్మికులు ఉన్నారు. కొందరు దుకాణాల్లో అప్పు పుట్టక ఇంట్లో ఉన్న వస్తువులను తాకట్టు పెట్టి వాటిని తెచ్చి కూరగాయలు కొని పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని పెడుతున్నారు. అధికారులకు ప్రభుత్వానికి మధ్యాహ్నం భోజన పథకం ఏజెన్సీల బాధలు మాత్రం పట్టిన పాపాన పోలేదు. కొన్నిచోట్ల గ్యాస్ స్టవ్‌లు ఉంటే సకాలంలో గ్యాస్ దొరక్క కొందరు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో గ్యాస్ లేకుండా కట్టెల పొయ్యి మీదనే మధ్యాహ్న భోజనం వంటకం చేస్తున్నారు. అలా వంట చేయడం వల్ల ఆ పొగ వంటలు గాలి పీల్చడం వల్ల అనేక వ్యాధులు గురవుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. అయినప్పటికీ వారిపై ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. నిర్వాహకులు నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతూ ఇదిగో చిరుద్యోగమని భావిస్తూ ఏదో ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుందని ఆశతో పనులు చేస్తున్నప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. సంబంధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులను బిల్లులు ఇచ్చేలా సాయం చేయమని కోరినా వారు మాత్రం తమకు సంబంధం లేదని అంతా పైఅధికారులు డబ్బులు పంపితే తప్ప తామేమి చేయలేమని ఎలాంటి సాయం అందించి మిమ్మల్ని ఆదుకోలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం మాత్రం నిలపకుండా చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. మూడు నెలలుగా వేతనాల కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు.

మెనూ ప్రకారం అందించాల్సిందే..

వైసిపి హయాంలో ఉన్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా మార్చారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ కూడా అమలు చేస్తున్నారు. ఈ మెనూలో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని సోమవారం నుంచి శనివారం వరకూ ప్రభుత్వం నిర్ణయించిన ఐటమ్స్‌ను అప్పులు చేసి మరీ విద్యార్థులకు అమలు చేస్తున్నారు.

భారంగా కూరగాయలు, నిత్యావరస ధరలు

ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పథకం



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికులు

పిల్లలకు అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. మెనూ ప్రకారం నిత్యం భోజనం అందించాలంటే కూరగాయలు, నిత్యావసర ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అందుతున్నాయి. ఇటీవల కాలంలో టమోటా కిలో రూ.40 నుండి ఒక్కసారిగా రూ.60 పెరిగాయి. పచ్చిమిర్చి రూ.80, కంది బేడలు రూ.180, తెల్ల గడ్డలు రూ.480, నూనె ధరలు కూడా విపరీతంగా పెరిగాయి.

ఇబ్బందుల్లో వంట కార్మికులు

కొన్ని పాఠశాలలో ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోవడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేయలేక మానుకుంటున్నారు. పిల్లలకు రుచికర భోజనం అందించాలంటూ అధికారులు జారీ చేయడమే కాకుండా అప్పుడప్పుడు తనిఖీలు చేయడం గమనార్హం. కోడిగుడ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఆ పంపిణీ చేసిన గుడ్లలో కూడా చాలా గుడ్లు కాలం చెల్లిని ఉండటం వల్ల అవి కొన్ని పగిలిపోయి ఉంటాయి. ఆ గుడ్లల్లో ప్రతినిత్యం పిల్లలకు ఉడకబెట్టి ఇవ్వాల్సిన పరిస్థితి వంట చేసే వారిదే. రూ.3 వేలు గౌరవతలం సరిపోవడం లేదని రూ.10 వేలు గౌరవేతనం ఇవ్వాలని కోరుతున్నారు. నేతలు మారినా తమ రాతలు మాత్రం మారలేదని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి తమకు బిల్లులు చెల్లించి, వేతనం అందించే ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని భారం పెరిగింది

ప్రతిరోజు ఉదయం నుంచి వంట చేసి పాత్రలు శుభ్రం చేసి, వంట రూములను పరిశుభ్రంగా చేసుకుంటున్నాం. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక కార్మికులు ఉండాలి. మా పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు కార్మికుల మాత్రమే ఉన్నాం. వర్షం వస్తే వంట చేయడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. పనిభారం పెరుగుతుంది.



- సుధారాణి, వంట కార్మికులు, రాయచోటి.

వేతనం సరిపోవడం లేదు

ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పిల్లలకు వంట చేస్తున్నాం. ఈ పని తప్పితే వేరే పనికి వెళ్లలేకున్నాం. ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేలు గౌరవేతనం సరిపోవడం లేదు. రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట సామగ్రి కూడా మేమే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం స్పందించి రూ.పది వేలు వేతనం ఇవ్వాలి.



- సంధ్య, కార్మికులు, రాయచోటి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన ఏజెన్సీలకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి. కార్మికులకు రోజుకు రూ.వంద చొప్పున రూ.3 వేలు వేతనం ఇస్తున్నారు. అది కూడా బిల్లులు ఇచ్చినప్పుడు మాత్రమే. రోజువారీ నెల వారి ఖర్చులకు అప్పులు చేయవలసి వస్తున్నది. కనీసవేతనం రూ.15 వేలు ఇవ్వాలి. మరో వైపు స్మార్ట్ కిచెన్ల పేరుతో మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలకు కార్మికులకు ఉపాధి కోల్పోయే ప్రమాదముంది. స్మార్ట్ కిచెన్లు కేవలం కూటమి కార్యకర్తల కోసం తప్ప ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలకోసం కాదు. ధరలు పెరిగిన కారణంగా ప్రైమరి పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రూ.10, హైస్కూల్ విద్యార్థికి రూ.15 ఇచ్చి ప్రతి నెల ఒకటో తేదీ బిల్లులు వచ్చేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలి.



ఎ.రామాంజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.

జేబులు నింపుకోవడానికే పిపిపి విధానం

- వైద్య కళాశాల వద్ద నిరసనలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పిపిపి విధానంతో మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ పేరుతో కూటమి నాయకులు జేబులు నింపుకోవడానికేనని వైసిపి నాయకులు అన్నారు. మెడికల్ కాలేజ్‌ల ప్రయివేటీకరణ నిర్ణయంపై శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వెంటనే రద్దుచేయాలి, పేదల కలలు ప్రభుత్వ కళాశాలలు, పేదలకు దూరంగా వైద్యం, బాబు బినామీలకు నైవేద్యం, అన్నీ ప్రయివేటీకరణ చేస్తే ప్రభుత్వమెందుకు, అందరికీ వైద్య విద్య అందరికీ వైద్యం, జగన్ ఇచ్చిన 17 మెడికల్ కళాశాలల వరాన్ని కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు తాకట్టుపెడుతోందంటూ పెద్దఎత్తున నినదించారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పుంగనూరు నియోజకవర్గ నేతలు శ్రీనాథ్‌రెడ్డి, అనూషరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు భూమన అభినయ్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు షమిమ్ అస్లాం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనుజారెడ్డి, వైస్ ఛైర్మన్ నూర్ అజాం, వైసిపి యువనేత హర్షవర్ధన్‌రెడ్డిలతో పాటు 17 నియోజకవర్గాల నుండి నేతలు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కుట్రపూరిత మెడికిల్‌పై వైసిపి ఉక్కు పిడికిలి బిగించింది. పేదింటి బిడ్డలకు వైద్య విద్య భారం కాకూడదని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో అప్పటి సిఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ.470 కోట్లతో 95 ఎకరాలలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, వివిధ దశల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కూటమి పాలన అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయయని, ఏడాదన్నరగా పనుల్లో పురోగతి లేదన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఆశలపై నీళ్ల జల్లుతూ సిఎం చంద్రబాబు పిపిపి తేరపైకి తీసుకొచ్చి, రాష్ట్రంలో 10 కళాశాలలను ప్రైవేటీకరణ చేసే చర్యలకు ఉపక్రమించారని ఆరోపించారు. ప్రయివేట్ చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే పేద విద్యా ర్థులు ఆ వైద్య కళాశాలల గుమ్మం ఎక్కలేని పరిస్థితి తలెత్తనుండడంతో పాటు వైద్యం ఖరీదవుతుందని, ఇది సమాజానికి మంచిది కాదని భావించిన వైసిపి పోరాటాలకు సిద్ధమైందని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను పిపిపి పద్దతిలో మెడికల్ కళాశాలలను అప్పగించడాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత ఉంటే, మెడికల్ కళాశాలను పిపిపికి అప్పగించి పేదలకు అన్యాయం చేయడమేనని నిప్పులు చెరిగారు. పేద ప్రజలకు వైద్య విద్యను, వైద్యాన్ని దూరం చేయడం కూటమి ప్రభుత్వం కక్ష్య సాదింపేనన్నారు. ప్రభుత్వత్వానికి పేదలపై ప్రేమ ఉంటే వైసిపి తీసుకు వచ్చిన 17 మెడికల్ కళా శాలలను మరింతగా అభివృద్ధి చేసి చిత్తశుద్ధిని చాటుకుంటే ప్రజలు హర్షిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధిలో పోటీపడాలే కాని వివక్ష చూపడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత వైఖరిని మార్చుకుని, తమ నిర్ణయాన్ని ఉప సంహారించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చూరగొనక ముందే, పిపిపి విధానాన్ని ఉపసంహరిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ కార్యదర్శి ఎస్.ఎ.కరీముల్లా, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున, హర్షవర్ధన్‌రెడ్డి, దండాల రవిచంద్రారెడ్డి, తట్టి శ్రీనివాసులురెడ్డి, తంబళ్లపల్లి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు దేవిరెడ్డి పద్మజారెడ్డి, సర్పంచ్‌లు గువ్వల నాగరాజరెడ్డి, మహేష్ బాబు, ఈశ్వరయ్య, మంజుల పాల్గొన్నారు.

వాల్మీకిపురం: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ప్రక్రియను ఆపకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైసిపి పీలేరు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు పులి శివారెడ్డి అన్నారు. చలో మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమానికి వాల్మీకిపురం మండలం నుంచి వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతోనే గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్య క్రమంలో నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి, చంద్ర శేఖర్, నరసింహులు, ఆనంద్, రఘు, రమేష్, లక్ష్మీనా రాయణరెడ్డి, చలపతి, విశ్వనాథ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రాంగణ ఎంపికల్లో 12 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె: మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన యంకోర్ టెక్ అకాడమీ ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల నుండి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి సంవత్సరానికి రూ.3 లక్షల వేతన ప్యాకేజీ లభించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ పి.రాయుడు విద్యార్థులను అభినందించారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ సి.మనోజ్ కుమార్, అధ్యాపకులు కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

27న సాఫ్ట్ బాల్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ఈ నెల 27న పుల్లంపేట ఎపి మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఉమ్మడి కడప జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ పురుషులు, సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహి స్తున్నట్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ ఎంపికలకు రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు ఎం.వి.రమణ, పి.నర సింహారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. సబ్ జూనియర్ ఎంపికలకు వచ్చే క్రీడా కారులు జనవరి 1, 2011 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చే వారు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డులు వెంట తీసుకొని రావాల్సి ఉంటుం దన్నారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, వివరాలకు 8897594213, 9515583664 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిశ్చల్ నాగిరెడ్డిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి: పట్టణంలోని స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో రవాణా, క్రీడ యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు మండిపల్లె నిశ్చల్ నాగిరెడ్డి ఉన్నత చదువులు కోసం శనివారం లండన్‌కు వెళుతున్న సందర్భంగా టిడిపి రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బా రెడ్డి, మహిళా నాయకులు సుజాత, కార్యకర్తలు శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలసి గజమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై నాయుడు, మేస్త్రి రమణ, మోటకట్ల సాంబశివరెడ్డి, రంజిత్, లడ్డు యాదవ్, నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం ఏజెన్సీల నిర్వాహకులకు నాలుగు నెలల పెండింగ్ బిల్లులతో పాటు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మధ్యాహ్నం భోజన ఏజెన్సీ కార్మికులతో కలిసి డిఆర్ఒ మధుసూ దన్‌రావును కలిసి వినతి పత్రాన్ని సమ ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అంటే ఏజెన్సీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ ఛార్జీలను పెంచాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.15000 ఇవ్వాలి అన్నారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే వారి ఉపాధికి గండిపడుతోందని అన్నారు. వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన వంట ఏజెన్సీల నిర్వాహకులు జయన్న, అమీర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా పరిశుభ్రమైన రాయచోటి వైపు అడుగులు వేద్దామని మున్సిపల్ కమిషనర్ జి.రవి కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ తాహి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు పరిశుభ్రత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు కళాశాల పరిసరాల పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే మార్కెట్, బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పబ్లిక్ పరిసరాలు శుభ్రపరచడం, ప్రజల్లో పరిశుభ్రత అలవాటును పెంపొందిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వారికి ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ అనుకూల పండగలను నిర్వహించడం, మొక్కలు నాటడం, పరిశుభ్రత పచ్చదనంతో కూడిన కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రజల్లో పరిశుభ్రత ఏకైక అలవాటుగా మారేందుకు విద్యార్థులను భాగస్వామ్యం చేయాల్సి ఉందన్నారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో వరుసగా అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తామన్నారు. పట్టణంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొ నాలని కోరారు. స్వచ్ఛతాహి సేవ 2025 కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకు పోకుండా చూసుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, భవనాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తే రాయచోటి పట్టణాన్ని పరిశుభ్రతలో ఆదర్శంగా మార్చడం సాధ్యమే అంటూ ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా డిగ్రీ కళాశాలలో పిచ్చిమొక్కలను పీకుతున్న కమిషనర్, విద్యార్థులు

వృద్ధులు సమాజానికి విలువైన వనరులు

ప్రజాశక్తి-పీలేరు

వృద్ధులు సమాజానికి విలువైన వనరులని, వీరి సూచనలతో విలువలతో కూడిన సమాజం సాధ్యమని తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీలేరు మండలం, ముడుపులవేములలో వయో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వయో వృద్ధులకు ఆరోగ్య, మానసిక, శారీరక, సమస్యలతో పాటు మార్పులు సహజమని, అందుకు అనుగుణంగా వారికి వ్యక్తి, కుటుంబం, సమాజం పూర్తి మద్దతునిచ్చి, ప్రతి విషయంలోనూ అండగా నిలబడాల్సిన అవసరం అందరికీ ఉందని అన్నారు. అంతేకాకుండా వారికి మనం సులభంగా జీర్ణమయ్యే పౌష్టికాహారం, సమయానికి మందులు, నేనున్నానన్న భరోసా ఇవ్వడం కుటుంబ, సమాజ బాధ్యతని డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కొండయ్య, శ్రీనివాసులు, ఎఎన్ఎం .వసుంధర, లక్ష్మి, సిహెచ్‌ఒలు నాగ ముత్యం, లావణ్య, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో అంతర్జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎల్, డిఎల్ సాంకేతికతలతో జనరేటివ్ ఎఐ అనువర్తనాలు అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియాలోని కాలహాన్, న్యూ సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఆసాది శ్రీనివాసులు, అదే విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి స్కాలర్ జి.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అతిధులు ఎ.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులును అధ్యాపక బృందం శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, కో-ఆర్డినేటర్ బి.నవీన్ కుమార్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక వెలుగు కార్యాలయం స్త్రీశక్తి భవన్ ఎపిఎం ఎస్ఎంఇ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మదనపల్లి వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ డి.శంకరప్ప మాట్లాడుతూ వ్యాపార, సేవా, పరిశ్రమల రంగాలలో నిర్వహించేవారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. మంచి వ్యాపార ప్రణాళికలతో అవగాహనతో ముద్ర, పిఎంఇజిపి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. ఎంచుకున్న రంగంలో అవగాహన, అనుభవం, ఆసక్తి తో ప్రయత్నించి అవకాశాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతినే కొనసాగించాలి


ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్ కార్డు 2.0ను రద్దుచేసి పాత పద్ధతినే కొనసాగించాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో రూపొందించిన ప్రైమ్ కార్డు 2.0 విధానాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆస్తులు క్రయ విక్రయదారులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. పూర్వం నుంచి అమలులో ఉన్న డాక్యుమెంట్ విధానాన్ని కాదని ప్రభుత్వం డిజిటల్ కార్డు ప్రైమ్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు తీసుకొచ్చి ప్రజలకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాయని, దాంతో పాటు లేఖరులు, వారి సహాయకులకు కడుపు కొట్టొద్దని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిఎస్ ఖాదరవల్లి, మురళి, చలపతి, మస్తాన్ సాహెబ్, జాఫర్, నర్సింహారెడ్డి, రాజా, చూడామణి, సత్తార్ సాహెబ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

25 వేల ఎకరాలకు సాగునీరు : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్-1లో రూ.450 కోట్ల నిర్మాణ పనుల కోసం త్వరలో టెండర్ల ద్వారా రాయచోటి, చిన్న మండెం, సంబేపల్లి మండలాల్లో 25 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నట్లు రవాణా, యువ జన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. శ్రీనివాసపురం మండిపల్లి నాగిరెడ్డి హంద్రీ-నీవా (హెచ్ఎన్ఎస్ఎస్) మెయిన్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి వినతి పత్రం అందజేశారు. దీని వల్ల 25 వేల ఎకరాలకు సాగునీటి లాభమని తెలిపారు. ఆయకట్టు నిర్మాణం పూర్తయితే రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల నిల్వలు పెరుగుతాయని మంత్రి వివరించారు. ఈ అం శంపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రికి హామీ ఇచ్చారు.



సిఎంతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని వడ్డెర కులస్తులను ఎస్‌టి జాబితాలోచేరుస్తూ ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని వడ్డెర ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ కూటమి పార్టీలో హామీ ఇచ్చి తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వడ్డెరలు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా, విద్యా పరంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారని పేర్కొన్నారు. సమస్యలు చెప్పుకోవడానికి అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ఒక సభ్యుడు కూడా తమ కులస్తులు లేరన్నారు. గతంలో ఎస్‌టి జాబితాలో ఉన్న వడ్డెర కులస్తులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసి-ఎలో చేర్చి తమ బతు కులు కూలదోసిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా వడ్డర్లను ఎస్‌టి జాబితాలో చేరుస్తామన్న హామీని కూడా కూటమి పాలకులు వెంటనే నెరవేర్చాలన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తా : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రజాసేవకు కలిసికట్టుగా ముందుకు వెళ్తానని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. శుక్రవారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నిశాంత్ కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో ముందుకు వెళ్తామని జిల్లా అభివృద్ధి, చట్ట వ్యవస్థ బలోపేతం, ప్రజాసేవలో పరస్పర సహకారంపై చర్చించామని చెప్పారు. జిల్లా పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం మరింత పెంపొందించుకోవాలని ఆత్మీయత ప్రజల శ్రేయస్సు కోసం కలిసి కృషి చేస్తామన్నారు. మర్యాదపూర్వక భేటీలో జిల్లా పరిపాలనలో నూతన ఉత్సాహం, సమన్వయం మరింత బలపడుతుందని తెలిపారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్‌పి ధీరజ్


విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కురవ సంఘం నాయకులు

5న కనకదాసు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కలికిరి

కనకదాసు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి అధిక సంఖ్యలో కురువ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కురుబ సంఘం అధ్యక్షుడు వినాయకం లక్ష్మన్న పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో కురవ సంఘం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 5న ఉదయం 9 నుంచి పూర్ణకుంభం కూడలి, ఆర్‌టిసి బస్టాండ్, తిరుపతిలో జరగబోయే కురుబల ఆరాధ్య దైవం కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని కురబ సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు వినాయక లక్ష్మన్న మాట్లాడుతూ కనకదాసు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి కలికిరి మండలం నుంచి అధిక సంఖ్యలో కురబ సోదరులు తిరుపతికి తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కనకదాసు కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటప్ప, కో-కన్వీనర్ బి.వెంకటరమణ, కమిటీ మెంబర్లు రవీంద్ర, సి మల్లీ, ఎం రెడ్డి శేఖర్, రమేష్, కలికిరి కురబ సంఘం నాయకులు మాజీ సర్పంచ్ జనార్ధన్ గౌడ్, గోవర్ధన్, దినకర్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** భక్త కనకదాస విగ్రహ విష్కరణను ఉమ్మడి చిత్తూరు జిల్లాల కురబసంఘం బాంధవులు జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లి పట్టణంలోని కురుబసంఘం కార్యాలయంలో విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వల్లిగట్ల వెంకటరమణ, రాచపల్లి రమేష్, బెల్లె రెడ్డెప్రసాద్, కప్పల శ్రీరాములు, వల్లిగట్ల వెంకటరమణ,మేజారి సదాశివ,సిపిఐ శివ కుమార్, మర్రిపాటి రమేష్, బండి రెడ్డెప్ప, కొప్పల నరసింహులు తదితరులు హాజరయ్యారు.

కోటకొండలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని కోటకొండ గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు పశుసంవర్ధకశాఖ మదనపల్లె డిడి డాక్టర్ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. శిబిరంలో 186 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు, 210 పశువులకు బ్యూటాక్స్ పిచికారి, 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 56 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్ల తెలిపారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎడి డాక్టర్ సుమిత్ర, కోటకొండ సర్పంచ్ చంద్ర శేఖర్, కూటమి నాయకులు రెడ్డెప్ప, రాజేష్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బిట్స్'లో విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బిట్స్ కళాశాలలో రాయచోటి పట్టణానికి చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు సూచించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో గురుప్రసాద్‌కు అవార్డు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సామాజిక సేవలో వివిధ రకాల సేవలందించినందుకు మండలంలోని ఆర్.రాచపల్లి జడ్‌పి హైస్కూల్లో ఇంగ్లీషు బోధిస్తున్న ఉపాధ్యాయుడు గోవిందయ్యపల్లి గురుప్రసాద్‌కు శుక్రవారం కడప ఆర్ట్స్ కళాశాలలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అవార్డును అందించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.వి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటాం

ప్రజాశక్తి-చిట్వేలి

ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటామని చిట్వేలి సోమేశ్వరాలయం కమిటీ సభ్యులు చైర్మన్ వీరాంజనేయులు, ఆర్గనైజర్ బొంతల నాగార్జునరావు, సభ్యులు మోహన్ అన్నారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, ధర్మనిధి అఖండ, సభ్యుల ఆధ్వర్యంలో శివాలయం ఆవరణంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ధర్మనిధి అఖండ సభ్యులు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేసి పరిరక్షించుకుంటామన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన ఆలయాలను వాటి స్థలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ఆలయ స్థలాలను ఆక్రమణకు పాల్పడితే సహించమన్నారు. కార్యక్రమంలో ధర్మనిధి అఖండ సభ్యులు శివ, నాని, కొనిశెట్టిసుబ్బరాయుడు, కదుమూరి రమణయ్య,నవీన్, తేజ ,మనీ, సురేంద్ర, నరసింహ,వెంకటరత్నం సాయి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


జెసిబితో చదును చేయిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దారి సౌకర్యం కల్పించండి సారూ..!

అధికారులకు కురబవానికుంట కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని పేదలకు కేటాయించిన కురబవానికుంట హౌసింగ్ కాలనీకి వెళ్లాలంటే బురద మయం..ఆదమారిస్తే అంతే సంగతులు అన్న చందంగా మారింది. హౌసింగ్ కాలనీలో సుమారు 550 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు.ఈ కాలనీలో చాలావరకు పూర్తి స్థాయిలో ఇళ్లను నిర్మించి సుమారు 20 నుంచి 30 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. మరి కొందరు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసి నివాసం ఉండేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారుకానీ రహదారి వేయడాన్ని మాత్రం అధికారులు మరచి పోయారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డున వెళ్లాలంటే భయాందోళనంగా ఉందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. తరచుగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డంతా బురదమయమై వాహనాలు బురదలో చిక్కుకొని పోతున్నాయని అన్నీరు. చిన్నారులు, వృద్ధులు బురదలో జారిపడి గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో వెళ్లాంటే భయంగా ఉందని ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చొరవ చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్న కాలనీవాసులు

వీధి కుక్కల స్వైర విహారం..బెంబేలెత్తుతున్న ప్రజలు

చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి


ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న వీధికుక్కలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడు పట్టణంలో కుక్కల స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కుక్కలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కుక్కలు వచ్చి వీధి వీధిలో తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.గొర్రెల సంతకు కర్ణాటక ప్రాంతం నుంచి వాహనాలు వచ్చి కుక్కలు గాలివీడులో వదిలిపెట్టడం ద్వారా సమస్య అధికమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి గేటు నుంచి బస్టాండ్ వరకు చూస్తే రోడ్డు పైన కుక్కల దాడి విధివీధులలో కూడా కుక్కలతో ప్రజలు బెంబే లెత్తుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులకు బయటకు పంపాలంటే జంకు తున్నారు. వాహనదారులను వెంబడిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పర్యాయం పంచాయతీ సిబ్బంది కుక్కల న్నిటిని తరలించారు. అయినా కూడా తిరిగి కుక్కలు అధికమయ్యాయి. పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి గ్రామాలు, పట్టణంలో కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆరోగ్యవంతమైన మహిళలతోనే శక్తివంతమైన కుటుంబాన్ని నిర్మించవచ్చునని నిమ్మనపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ప్రత్యూష అన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లి గ్రామంలో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. ఆరోగ్య సమస్యలను, పౌష్టికాహార లోపాలను అధిగమించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకుపంపిణీ చేయడం జరిగిందన్నారు. కేన్సర్ స్క్రీనింగ్, టిబి వ్యాధి నివారణ, జీవనశైలిలో వస్తున్న మార్పులు పై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఆరోగ్య బీమా కార్డుల నమోదు, సికెల్ సెల్ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం స్వస్థ నారీపై ప్రతిజ్ఞ చేయించారు. చిన్నపాటి క్రమశిక్షణ, ఆరోగ్య నియమాలతో ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, సూపర్‌వైజర్ దేవేంద్ర, దేవకుమారి, అంగన్వాడీపర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పిలు శకుంతల, కరుణ, ఎఎన్ఎం శోభరాణి, అంగన్వాడీ కార్యకర్తలు శారద, రాధిక పాల్గొన్నారు. **నందలూరు :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె-3 కి సంబందించిన అయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఏరియాలో స్వశక్తనారీసశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట నారాయణ, పిహెచ్ఎన్ శైలజ, ఆరోగ్య కార్యకర్త మధుసూదన్ రెడ్డి, 104 సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** మహిళలు, చిన్న పిల్లలు, ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఆనందంగా, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ఈ కార్యక్రమాన్ని జరుగుతున్నట్లు తెలిపారు. రక్తపు పోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్,తల్లి బిడ్డ సేవలు, వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరిక్షలు, క్షయవాది స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సామాజికఆరోగ్య కేంద్రం వైద్యులు, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** మహిళల ఆరోగ్యంతోనే దేశం సౌభాగ్యం ఉంటుందని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని కోన పంచాయతీ బంగారువాండ్ల పల్లెలో నిర్వహించిన స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్య వంతమైన జీవితాన్ని గడిపినప్పుడే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు.కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్, సిహెచ్ఓ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్ నాగరాజా, హెచ్ఎరామకృష్ణ , ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్ హెచ్‌పి కుసుమ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇవాళ బి.కొత్తకోట సామాజిక ఆసుపత్రిలో వైద్యులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మృతి చెందుతు న్నారన్నారని,ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్,డాక్టర్ నర్సారెడ్డి,డాక్టర్ హసీనా పర్వీన్,డాక్టర్ దుర్గాదేవి,ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు,సిబ్బంది పాల్గొన్నారు.


కలికిరి: మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ గౌరీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి అండర్-14, అండర్-17 సంవత్సరాల లోపు బాల , బాలికలు రెండేసి విభాగాలుగా పలు క్రీడలలో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. మొదటిరోజున కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ, నందలూరు, పాటూరు ప్రధానోపాధ్యాయులు శ్రీని వాసులు, మాధవీలత, వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీ, సుస్మిత, సునీత, జగన్, వెంకట మధు, హరిణి, శిల్పి ఆనందాచారి, గొంటుముక్కల వెంకట రమణ, బోగా వెంకటసుబ్బయ్య, షఫీ ఉల్లా తదితరులు ఈ క్రీడాపోటీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. మండల స్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు త్వరలో డివిజన్ స్థాయిలో జరగబోయే పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించిన వారవుతారని కో-ఆర్డినేటర్ గౌరీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరీకిరణ్ ఉజాల, విజయ కుమారి, గీత, రమణమ్మ, జ్యోతి ప్రియ, ప్రసాదరావు, గాయత్రీ దేవి, డాక్టర్ శర్వాణి, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీపై సమీక్ష

ప్రజాశక్తి- కలకడ

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీపై డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తహశీల్దార్ మహేశ్వరిబాయి తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని డీలర్ షాపుల వద్ద డీలర్లు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించి వాటిని ఆన్‌లైన్ చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో 10797 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని వాటిని శనివారం నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని తెలి పారు. ఈ విషయాన్ని కార్డుల లబ్ధిదారులు గుర్తించి తమ తమ డీలర్ల వద్దకు వెళ్లి రేషన్ స్మార్ట్ కార్డు పొందవలెనని ఆమె తెలిపారు. 65ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్ద పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ డీలర్లు కార్డు దారులకు తెలియపరచి అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.


డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న తహశీల్దార్

బాలుడిపై వీధి కుక్క దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటివద్ద ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్క విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బాలుడి తల్లిదండ్రుల కథనం మేరకు.. పట్టణ సమీపంలోని వలసపల్లి పంచాయతీ, డ్రైవర్స్ కాలనీకి చెందిన మహేష్, గంగోత్రి దంపతుల కుమారుడు తరుణ్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా బాలుడి పై దాడి చేసింది. విచక్షణారహితంగా కొరికి గాయపరిచింది. స్థానికులు అడ్డుకొని కుక్కను తరిమేసారు. తీవ్రంగా గాయపడిన బాలున్ని తల్లిదండ్రులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.


వీధి కుక్కదాడిలో గాయపడిన బాలుడు

బాలయ్యగారిపల్లెలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- కలకడ

మండల పరిధిలోని బాలయ్యగారిపల్లెలో పారిశుధ్య పనులను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి దేవేందర తెలిపారు. సర్పంచ్ విశ్వనాథనాయుడు ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులో ఉన్న ముళ్ళ పొదలను, పేడ దిబ్బలను జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో తొలగించి గ్రామస్తులు రోగాలు బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వర్షపు నీటితో నిండిన గుంతలను మట్టితో పోల్చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు, గ్రామస్తులు తెలిపారు.


బస్‌షెల్టర్ ముందు అడ్డుగా ఉన్న వాహనాలు

ప్రయాణికులకు అడ్డుగా వాహనాలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని టోల్‌గేట్ సెంటర్ వద్ద గల బస్ షెల్టర్లు ముందు భాగంలో వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి, రాజంపేట, కడపకు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు వారి వాహనాలను బహిరంగంగానే ప్రయాణికులకు అడ్డుగా నిలిపి బస్సు ఎక్కేందుకు ఇబ్బంది కలిగిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సెంటర్ లోని కుర్చీలలో ప్రయాణికులు కాకుండా ఇతరులు కూడా ఎక్కువగా కూర్చొని ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని చెబుతున్నారు. దీనిని పట్టించుకునే వారే లేరా అని విమర్శిస్తున్నారు. ప్రయాణికులకు అడ్డుగా పెడుతున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు పోలీసులకు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఉమామహేశ్వరస్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని నిమ్మనపల్లి రోడ్డులో నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు నిర్వాహకులు వెంకటరెడ్డి తెలిపారు. శివాలయంకు ఉన్న గేటు బీగాలను పగలగొట్టి హుండి, సిసి కెమెరాలకు సంబంధించిన డివిఆర్ బాక్స్, వెండి కిరీటంను దొంగలించుకొని వెళ్లినట్లు తెలిపారు. హుండిలో రూ.2వేల వరకు డబ్బులు ఉండవచ్చునని, వాచ్‌మెన్ గుడి లోపల కాకుండా సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద నిద్రపోతుండడంతో దొంగతనం జరిగినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం 5:30గంటల సమయంలో వాచ్‌మెన్ గుడి వద్దకు వెళ్లి చూడగా గుడిలో దొంగతనం జరిగినట్లు గుర్తించి, నిర్వాహకులకు సమాచారం అందించడంతో నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. డాగ్ స్క్వాడ్ ద్వారా దొంగల కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భర్తను మట్టుపెట్టిన భార్య

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమ్ముడితో కలిసి భర్తను మట్టుబెట్టిన భార్య ఉదంతం పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహానికి శుక్రవారం రెండో పట్టణ పోలీసులు స్పాట్ పోస్టుమార్టం నిర్వహించారు. రెండో పట్టణ సిఐ రాజారెడ్డి కథనం మేరకు.. పట్టణంలోని రామారావు కాలనీ చెందిన జరిపి రామన్న (40) కూలి పనులు చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఇతనికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలలుగా కనపడకుండా పోవడంతో అనుమానం వచ్చిన అతని తమ్ముడు హనుమంతు ఈ ఏడాది జూన్ 21న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. రామన్న హత్య కు గురైనట్లు నిర్ధారణకు వచ్చి ఆ కోవలో దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది మార్చి 12 న రామన్న మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య రమణమ్మతో గొడవపడి కొడుతుండగా ప్రతిఘటించిన ఆమె కర్రతో దాడి చేసిందన్నారు. కిందపడ పోయిన అతన్ని భార్య రమణమ్మ, ఆమె తమ్ముడు ఈశ్వ రయ్య విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. ఈ దాడిలో రామన్న మృతి చెందడంతో అక్క, తమ్ముడు ఇద్దరూ కలిసి మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ కస్తూ ర్బా పాఠశాల వెనుక వైపు హంద్రీనీవా కాలువ గట్టుపై మృతదేహాన్ని పూడ్చి వచ్చేస్తారు. దర్యాప్తు ఈ వాస్తవాలు తెలియడంతో శుక్రవారం పోలీసులు బి.కొత్తకోట కు వెళ్లి మృతదేహానికి స్పాట్ పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కేసుపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే నిందితు లను అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూల్ వాచ్‌మెన్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో స్కూల్ వాచ్ మెన్ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు..మండలపరిధిలోని నిమ్మనపల్లి రోడ్డు బసినికొండలో నివాసముంటున్న శ్రీనివా సులు(55) స్థానికంగా ఉంటున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం పాఠశాల అనంతరం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యంలోని బైపాస్ రోడ్, సాయిబాబా గుడి వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గమనిం చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య అమరావతి, కుమారుడు కుమార్తె ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఇతర ఉపాధ్యాయులు ఆస్పత్రికి వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

టర్పెంట్ ఆయిల్ తాగి రెండేళ్ల చిన్నారి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : టర్పెంట్ ఆయిల్ తాగి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. చిన్నారి తల్లి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సాదియా గత కొన్నాళ్ల క్రితం తన రెండేళ్ల కుమార్తె అలీజాతో కలిసి మదనపల్లె పట్టణానికి వలస వచ్చింది. సైదాపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ నీరుగట్టువారి పల్లెలోని చేనేత మగ్గాల వద్ద రీలింగ్ కేంద్రంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం కుమార్తెను తీసుకొని సాదియా పనికి వెళ్ళింది. పాప ఆడుకుంటుండగా తల్లి పని చేసుకుంటోంది. ఈ క్రమంలో అక్కడ ఉన్న టర్పంట్ ఆయిల్ ను నీళ్లనుకుని పాప తాగేసింది. దీంతో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో గమనించిన తల్లి హుటాహుటిన స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. పాపను తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరు అరెస్టు

ప్రజాశక్తి -పీలేరు : వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ గురు ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం డిఎఫ్ఓ మీడియాతో మాట్లా డుతూ పీలేరు అటవీ శాఖ సంచార దళ నిఘా విభాగం కార్యాలయానికి గురు వారం అందిన రహస్య సమాచారం మేరకు పట్టణ సమీపంలోని ఎల్లమంద క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్నోవా కారులో ఐదుఎర్రచందనం దుంగలు తరలిస్తున్న నిందితుడిని కారుతో సహా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కారుతో సహా ఎర్రచందనం విలువ రూ.8.24లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుడు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తని చెప్పారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఓ చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఓ యోగేష్, ఎఫ్‌బిఓ రెడ్డి ప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.


పట్టుబడిన ఎర్రచందనం,నిందితుడితో అటవీశాఖ సిబ్బంది